క్లుప్తంగా

విమాన ప్రమాదం ఘోర దుర్ఘటన

మాజీ ఎంపీ భరత్ నివాళులు



మృతులకు నివాళులు అర్పిస్తున్న మార్గాని భరత్‌రామ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఘోర దుర్ఘటనలు భవిష్యత్‌లో జరుగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ఈ దుర్ఘటన అందరి హృదయాలను కలిచివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వర రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కానబోయిన సాగర్, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గుత్తుల మురళీధర్, నగర మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరగాటి దుర్గ, సంకిస భవానీ ప్రియ, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, సీరపు గణేష్‌రెడ్డి, వాసంశెట్టి గంగాధర్, సప్పా అదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రక్తదాన దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల, రెడ్‌క్రాస్ వలంటీర్లు, సాయినర్సింగ్ కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ జి.రవితేజ రెడ్ క్రాస్ వలంటీర్లు, ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ సమన్వయంతో ర్యాలీని నిర్వహించి, అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. రక్తదాతల కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో వలంటీర్లు రక్తదానం చేసి చేశారు. రక్తాన్ని దానం ప్రాణదానంతో సమానమనే సందేశాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఇచ్చారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ రక్తదానం వల్ల హృదయ సంబంధమైన వ్యాధులను దూరం చేసుకోవచ్చునని, దేహంలో ఉన్న కొవ్వును తగ్గించుకోవచ్చునన్నారు. కాలేయ వ్యాధులను దరిచేరకుండా చేసుకోవచ్చు అన్నారు. ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి సుజాత మాట్లాడుతూ విద్యార్థులు రక్తాన్ని దానం చేయడాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా కొన్ని కుటుంబాలను రక్షించినవాళ్లమవుతామని వివరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వలంటీర్లు ఎంతో ఉత్సాహంగా సాయి నర్సింగ్ కాలేజ్ మొదటి సంవత్సరం విద్యార్థులతో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

జేసీఐ ఆధ్వర్యంలో..

కంబాలచెరువు: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జేసీఐ రాజమండ్రి విభాగం ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జేసీఐ ప్రెసిడెంట్ అనంత శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో స్థానిక ధన్వంతరి బ్లడ్ బ్యాంకులో సుమారు 150 మందికి పైగా రక్తదానం చేశారు. రాజమండ్రి రైజింగ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మాటూరి సిద్ధార్థ 49వ సారి రక్తదానం చేశారు.

వ్యక్తి అదృశ్యం



గుబ్బల ఏసుబాబు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన తండ్రి కనిపించడం లేదని పాత బొమ్మూరుకు చెందిన గుబ్బల రవిదుర్గాప్రసాద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాత బొమ్మూరు గ్రామానికి చెందిన 60 ఏళ్ల గుబ్బల ఏసుబాబు హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో పరుపులు ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. అయితే ఫ్యాక్టరీ నష్టం రావడంతో ఏసుబాబు కొంతకాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. దీంతో కుటుంబ సభ్యులతో గొడవపడి ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడని, పరిసర ప్రాంతాలలో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని దుర్గాప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 9633 (సిఐ), 94911 22811 (ఎస్సై) ఫోన్ నెంబర్లలో తెలపాలని పోలీసులు కోరారు.

ఘనంగా గంగాలమ్మ జాతర

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులోని గంగాలమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనతరం గరగన్రృత్యాలు, తీన్‌మార్, బుట్ట బొమ్మలు, శక్తి వేషాలు అలరించాయి. పడాల ఆడపడుచు కావడంతో పడాల కుటుంబ సభ్యులు, వారి ఆడపడుచులు అందరూ ఎక్కడ ఉన్న ఈ జాతర రావడం ఆనవాయితీ. కమిటీ సభ్యులు పడాల కమలారెడ్డి, కర్రి సంతోష్‌రెడ్డి, సత్తి రామారెడ్డి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలను ఘనంగా నిర్వహిద్దాం

- ప్రతి ఘాట్ పుష్కర్‌ఘాట్‌గా విస్తృత ప్రచారం చేయాలి
- కమిషనర్ కేతన్ గార్గ్
- చాంబర్ ఆఫ్ కామర్స్‌లో అఖిలపక్ష సమావేశం



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు, పుర ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అనుభవం ఉన్న వారందరి భాగస్వామ్యంతో 2027లో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించుకుందామని కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శనివారం నగరాభివృద్ధి, రాబోవు పుష్కరాల పనులు తదితర అంశాలపై స్థానిక మెయిన్ రోడ్డులో గల చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణ మూర్తి (రాజా), కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ సారథ్యంలో అఖిలపక్ష నాయకుల, పుర ప్రముఖులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే యాత్రికులు ఏ ఘాట్‌లో చేసిన ఒకే ఫలితం వస్తుందన్న సంకేతం ఇవ్వాలని, ఇందుకోసం ప్రతి ఘాట్ పుష్కర్ ఘాట్‌గా వ్యవహరించాల్సి ఉందని సూచించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పుష్కరాలకు దశల వారీగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శానిటేషన్ పరంగా ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టామన్నారు.

భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామనీ, నగరంలో ముఖ్యమైన ఘాట్లలో ఇన్ అండ్ ఔట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత పుష్కరాల నిర్వహణపై సమీక్షించుకుని 2027 పుష్కరాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏ ఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీ నియంత్రణకు స్వచ్ఛంద సేవకులుగా మాజీ సైనికులు, పోలీసులను వినియోగిస్తే బాగుంటుందన్నారు. ఏపీ ఈపీ డీసీఎల్ ఏఈ తిలక్ మాట్లాడుతూ అన్ని ప్రధాన ఘాట్లలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ చారిత్రాత్మక, సాంస్కృతిక, సంప్రదాయాలు కలిగిన నగరంలో గోదావరిలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యమేనని దీనిని భక్తులకు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పుష్కరాలు జరగాలనీ, ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

మల్టీ లెవెల్ వాహనాల పార్కింగ్

ఏపీహెచ్‌వీబీసీ మాజీ చైర్ పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ మల్టీ లెవెల్ వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను చేపట్టాలని చిన్న వ్యాపారుల జోలికి వెళ్ల వద్దని కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ గోదావరిని కాలుష్యం నుంచి కాపాడాలన్నారు. రహదారులు విస్తరించకుండా డివైడర్లు కట్టడం వలన ట్రాఫిక్ జాం అవుతోందని దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి మధు, చాంబర్ పూర్వాధ్యక్షుడు పాలసానపల్లి హనుమంతరావు, కొల్లేపల్లి శేషయ్య, బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు, నందెపు శ్రీనివాస్, దొండపాటి సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక పుస్తకాలూ చదవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యార్థులు పాఠ్య పుస్తలకాలతో పాటు సామాజిక పుస్తకాలు చదవాలని బీవీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల ముగింపు సభలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. బాలాజీదాస్ విజ్ఞాన కేంద్రం (బీవీకే) ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సహకారంతో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఎస్‌కేవీటీ హైస్కూలులో జరిగిన శిక్షణ తరగతులకు సుమారు 150 మంది పైగా విద్యార్థులు హాజరయ్యారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు అరుణ్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కష్టానికి చేయూతనివ్వరూ..

- వైద్యానికి రూ.16 కోట్లు అవసరం
- సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



పాపతో తల్లిదండ్రులు ఈశ్వర్, శ్రావణి

కడియం: మొదటి కాన్పులో అమ్మాయి పుట్టిందని ఎంతో సంతోషించిందా కుటుంబం. ఎంత ముద్దుగా సాకాలనే ప్రణాళికలు వేసుకున్నారు. ఆమె బోసి నవ్వులకు మురిసిపోయి మోహన అనే పేరు పెట్టుకున్నారు. విధి వెక్కిరించి రెండు నెలలకే ఆమెలోని అనారోగ్యాన్ని బయటపెట్టింది. మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ చైతన్యనగర్‌కు చెందిన దాక్కా ఈశ్వర్, శ్రావణిల గారాలపట్టి మోహనకు తట్టుకోలేని కష్టం వచ్చిపడింది. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) టైప్ 1 సమస్య వచ్చిందని వైద్యులు తేల్చి ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆమెను రక్షించాలంటే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్‌ను రెండేళ్ల వయసు లోపే ఇవ్వాలని చెప్పారు. ఆ ఇంజెక్షన్ అందే వరకు రూ.ఆరు లక్షల విలువైన సిరప్‌ను పాపకు అందించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. పేపరుమిల్లు ఉద్యోగిగా, వచ్చేదానితో కుటుంబంతో ఆనందంగా ఉందామనకున్న వారి ఆశలకు చిన్నారి మోహన అనారోగ్యం గండి కొట్టింది. పాపకు ఎప్పుడెలా ఉంటుందో అర్థంకాని రీతిలో అపస్మారక స్థితికి వెళ్లిపోతోంది. ప్రభుత్వం, దాతలు స్పందించి పాప వైద్యానికి సాయం చేయాలని ఈశ్వర్, శ్రావణి దంపతులు కోరుతున్నారు. కన్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సహాయం చేయదలచిన వారు 94411 01670కు ఫోన్ చేయాలని తండ్రి ఈశ్వర్ తెలిపాడు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమత్తులతో ఆది, సోమవారాల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీ డీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ శనివారం ప్రకటించారు. ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ ఆర్‌అండ్‌బి వాంబే గృహాలు, రాజీవ్ గాంధీ నగర్, వడ్డీల పేట, మున్సిపల్ కాలనీవాంబే గృహాలు, లూథరగిరి, దుర్గా నగర్, మల్లయ్య పేట పెట్రోల్ బంక్ రోడ్, ఊటలంక, లూథరగిరి ఐటీఐ కాలేజీ ఏరియా, శ్రీరామ్ నగర్, వివేక్ బిర్యానీ ఏరియా, పేపర్ మిల్లు సాయి బాబా టెంపుల్, పేపరుమిల్లు క్వార్టర్స్, ఆనంద్ నగర్, వెంకటరాయపురం, రామదాసుపేట, సానిటోరియం రోడ్, సీసీ కాలనీ, రామకృష్ణాపురం, క్వారీ రోడ్లలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కలిగే అంతరాయంతో వెంకటేశ్వర మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, శ్యామల నగర్, గాంధీపురం, పాత సోమలమ్మ టెంపుల్ రోడ్, రెహమాత్ నగర్ ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కలిగే అంతరాయంతో సుబ్బారావు నగర్, లాలా చెరువు ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కలిగే అంతరాయంతో అన్నపూర్ణమ్మపేట, అశోక థియేటర్ పరిసరాలు, మధ న్సింగ్‌పేట, ఆజాద్ చౌక్ సెంటర్, లక్ష్మీవారపు పేట, అల్లూరి సీతారామరాజు జంక్షన్, గణేష్ చౌక్ ప్రాంతంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ కలిగే అంతరాయంతో కాతేరు గ్రామంలో దాసరి నగర్, పంచాయతీ ప్రాంతం, సుబ్బారావు పేట, దేవాంగుల వీధి, సీటీఆర్ఐ రోడ్ ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం


కడియం: ఈనెల 16వ తేదీ, సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ జేబీబీ నటరాజన్ తెలిపారు. లైన్ల మరమ్మతుల్లో భాగంగా వేమగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని జేగురుపాడు ఫీడర్‌కు సరఫరా ఉండదన్నారు. దీంతో జేగురుపాడు, కడియపుసావరం గ్రామాలకు సరఫరా ఉండదని ఆయన వివరించారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాల్సిందిగా ఈఈ కోరారు.

సారా దుష్ప్రభావాలపై అవగాహన

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంట గ్రామంలో ఎక్సైజ్ సీఐ సుధ ఆధ్వర్యంలో సారా వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌రిధిలో ఏబీసీ కేటగిరిలో గల 29 గ్రామాలలో గత మూడు నెలల్లో సారా వలన కలిగే నష్టాలపై అవగాహన నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు సారా, తయారీ, విక్రయాలు, సేవించడం వల్ల పర్యవసానాలను వివరించామన్నారు. మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడిన 15 మందికి రూ.1.58 లక్షల జరిమానా విధించినట్టు తెలిపారు.

పద పాద పరివేష్టితమ్

- నాదానువర్తియై కదలిన పాదాలు
- ఆపాదమస్తకం ఆస్వాదించిన ఆహూతులు
- మూడో రోజు ఉత్సాహంగా అంతర్జాతీయ సంగీత ఫెస్ట్-2025



అభినయంతో ఆహూతులను అలరించిన నాట్యకారిణి లక్ష్మీదీపిక

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఝుమ్మంది నాదం.. సై అంది పాదం.. అంటూ అద్యంతం రసవత్తరంగా సాగింది కళాసమ్మేళన్. ఏకంగా వందకు పైగా నర్తకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వీరంతా బృందాలుగా ఏర్పడి డ్యాన్స్ బాలే ప్రదర్శించారు. పాటలు, శ్లోకాలు, కీర్తనలకు తగ్గ లైటింగ్ ఎఫెక్టులు ప్రేక్షకలను కట్టిపడేశాయి. శనివారం రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో అంతర్జాతీయ సంగీత ఫెస్ట్-2025లో భాగంగా శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యంలో కళా సమ్మేళన్ మూడో రోజు పోటీలు వైభవంగా సాగాయి.

కళలను కాపాడుకోవాలి : వినోద్ త్యాగి

కళలను కాపాడుకోవాలని, అందుకు నేటి తరం ముందుకు రావాలని ఉత్తర్‌ప్రదేశ్ మాజీ రీజినల్ మినిస్టర్ వినోద్ త్యాగి అన్నారు. 13 రాష్ట్రాలకు చెందిన కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, జానపద కళారూపాల్లో వారి ప్రతిభ చాటుకున్నారు. ప్రపంచం మొత్తం మన కళల పట్ల ఆసక్తి చూపుతోందన్నారు. మరో ముఖ్య అతిథి బీజేపీ నేషనల్ స్పోక్స్ పర్సన్ గోపాల కృష్ణ అగర్వాల్ మాట్లాడుతూ చిన్నారులు సైతం నాట్యాన్ని అలవోకగా ప్రదర్శిస్తున్నారంటే వారి కఠోర దీక్షను అర్థం చేసుకోవచ్చు అన్నారు. చిన్నతనం నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించడానికి శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు బీజీ నారాయణ కృషి అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో శివామి, వినోద్ ఆగ్రమోడీ, అశ్విన్ కుమార్, మనిష్ సోనీ పాల్గొన్నారు.

23 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు
- సరకుతో పాటు, పలు వాహనాల స్వాధీనం



గంజాయి పట్టివేత వివరాలు వెల్లడిస్తున్న నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ వీరయ్యగౌడ్ తదితరులు

రాజానగరం: మండలం కొండగుంటూరులో అక్రమంగా తరలిస్తున్న 23.101 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ శనివారం విలేకరులకు తెలిపిన వివరాల మేరకు కొండగుంటూరులోని ఒక లే అవుట్‌లో ఉన్న రేకుల షెడ్డు వద్ద స్థానిక సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై కేవీ నాగార్జున తమ సిబ్బందితో కలసి శుక్రవారం రాత్రి దాడి చేసి, తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉన్న టాటా వాహనంలో గంజాయి ప్యాకెట్లను, వాటిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ మండలం, దొరగుడ పంచాయతీకి చెందిన సురేష్ చంద్ర కులదీప్ (30), అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, పొల్లూరుకు చెందిన మనోరంజన్ మండల్ (20)లను అదుపులోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్, ఒక కారు, బజాజ్ వెస్పా స్కూటీ, టాటా అల్ట్రా గూడ్స్ క్యారియర్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

భార్యాభర్తలే సూత్రధారులు

గంజాయి అక్రమ రవాణాలో పాత్రధారులు చిక్కగా, సూత్రధారులు తప్పించుకున్నారు. ఉత్తారాదికి చెందిన రఘువీర్ రాయ్, అతని భార్య ప్రశాంతి రాయ్ ఈ గంజాయి అక్రమ వ్యాపారంలో ఆరితేరారు. ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ ఏరియా నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో టాటా వాహనంలో గంజాయిని కొండగుంటూరుకు తీసుకువచ్చారు. ఈ రవాణా చేసే సమయంలో వారి వాహనానికి ముందు రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు బైకుపై ఒక వ్యక్తి పైలెట్‌గా వ్యవహరించాడు. తీసుకువచ్చిన గంజాయిని రేకుల షెడ్డులో భద్రపరచాలని ఆదేశించి ఆ భార్యభర్తలు వ్యక్తిగత పనులపై రాజమహేంద్రవరం వెళ్లారు. ఇటీవలే ఈ ప్రాంతానికి వచ్చిన వారు కొంతకాలం రాజమహేంద్రవరం రూరల్ మండలం, కొంతమూరులో ఒక ఇల్లు కొనుగోలు చేసి, నివాసం ఉండేవారు. తరువాత ఆ ఇంటిని విక్రయించి, కొండగుంటూరుకు వచ్చి, ఇక్కడ కొత్తగా వేసిన లేఅవుట్‌లో ఒక ప్లాట్ (స్థలం) కొనుగోలు చేసి, భవంతిని నిర్మించే ప్రయత్నంలో ఉన్నారు. ఇందులో భాగంగా వేసిన రేకుల షెడ్డును గంజాయి నిల్వకు వాడుకుంటున్నారు. ఎవరైనా అడిగితే సీసీ కెమేరాల వ్యాపారం చేస్తున్నామంటూ ఆ ముసుగులో గంజాయి అక్రమ వ్యాపారం చేస్తూ వచ్చారు. వీరిపై కోరుకొండ, గోకవరం, విశాఖపట్నం, ఇతర పోలీసు స్టేషన్లలో కేసులున్నాయని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వీరయ్యగౌడ్, ఎస్సైలు కేవీ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ఫిట్‌నెస్ విధానంతో అవస్థలు

- జూలై 1న చలో రాజానగరం
- కార్మిక సంఘాల జేఏసీ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాసంశెట్టి గంగాధర్, బాక్స్ ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రవాణా వాహనాల విషయంలో నిబంధనలు కఠినంగా మార్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని దీనిని నిరసిస్తూ జూలై 1న చలో రాజానగరం నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ డిప్యూటీ మేయర్ బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్ (బాక్స్ ప్రసాద్), అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తదితరులు ప్రకటించారు. శనివారం రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద ఉన్న మెగా పార్టీ రూమ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేటు ఏటీఎస్ సెంటర్ల ద్వారా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ (బ్రేక్) పరీక్షల వల్ల వాహనాల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చివరికి వారి వాహనాల ఇంజిన్లకు కూడా నష్టం చేకూరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా శాఖ ఎంవీఐల ద్వారా చేయించాల్సిన ఈ పరీక్షా విధానాన్ని ప్రైవేటుకి అప్పగించడంతో ఆన్‌లైన్ చలానా చార్జీలతో పాటు సమయం కూడా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. తూర్పు గోదావరి జిల్లాకు ఒకే ఏటీఎస్ సెంటర్ రాజానగరంలో ఉందని, అక్కడ పరీక్షల నిర్వహణకు వెళ్లి వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆన్‌లైన్‌లో చలానా కట్టిన తరువాత అక్కడ 6 గంటలకు పైగా నిరీక్షించాల్సి వస్తోందని, పరీక్షల తరువాత ఓకే అయ్యిందో లేదో తెలియడానికి కనీసం వారం రోజులు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి వరకు వాహనాన్ని రోడ్డుపైకి తేవడానికి వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గుజరాత్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని వ్యతిరేకించాయన్నారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ జూలై 1న శాంతియుతంగా చలో రాజానగరం ఏటీఎస్ సెంటర్‌కు పిలుపునివ్వడం జరుగుతుందన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా గత ప్రభుత్వం రూ.10 వేలు ఏటా ఆర్థిక సాయం చేసిందని, ఈ ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. జేఏసీ పిలుపు మేరకు కోనసీమ జిల్లాలో కూడా ఇదే తరహాలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని అమలాపురం నాయకుడు సత్తిరాజు తెలిపారు. సమావేశంలో వివిధ యూనియన్ల నాయకులు నరవ గోపాలకృష్ణ, సప్పా ఆదినారాయణ, ముచ్చకర్ల సత్యనారాయణ, దొమ్మేటి సోమ శంకర్, వెన్నా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో యోగాసనాలు వేస్తున్న పోలీసులు



పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది



కడియంలో యోగా చేస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, ఎంపీడీవో రమేష్ తదితరులు

- ఎస్పీ నరసింహ కిశోర్
- జిల్లా పోలీసు కార్యాలయంలో సామూహిక యోగా సాధన

కంబాలచెరువు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్ పోలీసులు సామూహిక యోగా సాధన చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ×యోగాంధ్ర¥ వేడుకలలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసు అధికారులు, సిబ్బందికి యోగా అవసరమని అభిప్రాయపడ్డారు. యోగా సాధన వలన ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలిగి, మానసికంగా, భౌతికంగా దృఢంగా ఉండటానికి సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.చించిరెడ్డి, డీఎస్పీ రవి కుమార్, ఆర్ఐ సంజీవ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యయోగం!

యోగా ద్వారానే ఆరోగ్య యోగం సాధించవచ్చని, తద్వారా మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక బైపాస్ రోడ్‌లో గల దానవాయిపేట నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం జరిగిన ×యోగాంధ్ర కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందితో కలసి యోగాసనాలు వేశారు. ప్రాణాయామం ద్వారా శ్వాసకోశ సంబంధ వ్యాధులు రావని, శరీరంలో రక్తం శుద్ధి అవుతుందని వాసుదేవరావు తెలిపారు. విద్యార్థులు తమ దినచర్యలో యోగాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎస్.రవికుమార్ యోగాంధ్రలో పాఠశాల ప్రగతిని వివరించారు. రాజమహేంద్రవరం అర్బన్ రేంజి డీఐ బి.దిలీప్ కుమార్, సచివాలయ వార్డు పరిపాలనా కార్యదర్శి కళాధర్, ఉపాధ్యాయులు ఎల్.ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

కడియంలో..

కడియం: యోగా ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యలయం వద్ద ఎంపీపీ, ఎంపీడీవో రమేష్, గ్రామస్తులతో కలిసి యోగా చేశారు. సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ నాని, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనపర్తి రండి.. అవినీతి చూపిస్తా..

- సీఎం చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సవాల్
- వాటాలకు కక్కుర్తి పడితే మూల్యం తప్పదని హెచ్చరిక

రంగంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నియోజకవర్గానికి వస్తే స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహిస్తున్న మట్టి దందా, అవినీతి బాగోతం స్వయంగా చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో మట్టి అక్రమ రవాణా జరుగుతున్న జగన్నాథసాగరం చెరువు వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఎన్నికల ముందు అనపర్తిలో నిర్వహించిన పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడుతున్నప్పుడు ఆయన చెవిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పిన సూచనతో తనను గ్రావెల్ సూర్యనారాయణరెడ్డి అని వ్యంగ్యంగా సంభోదించారని, ఈ రోజు అనపర్తిలో ఎవరు గ్రావెల్‌ని, మట్టిని అడ్డగాడిదలా మెక్కేస్తున్నారో చూపిస్తానని సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై అధికారులకు ఫిర్యాదు చేసి ఆరు రోజులవుతున్నా ఒక్క అధికారీ స్పందించకపోవడంతో అవినీతి, అక్రమాలకు ప్రభుత్వం ఎంత పెద్దపీట వేస్తోందో స్పష్టమవుతోందన్నారు. ఈ అక్రమ సంపాదనలో అధికారుల వాటా ఎంతో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 164 మంది ఎమ్మెల్యేల్లో ఇక్కడి ఎమ్మెల్యే అంటే ఎవరో గుర్తించకపోవచ్చని, ఎన్నికల ముందు ఆయనకు టికెట్ ఇస్తే గెలవరని, బీజేపీకి పంపిన ఎమ్మెల్యేను చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అని ఆయన గుర్తు చేశారు.

ఎంపీ పురంధేశ్వరి స్పందించాలి...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి కూడా ఇప్పటి వరకు ఈ విషయంపై స్పందించ లేదని, అంటే ఆమె కూడా నల్లమిల్లి అక్రమ దందాను ప్రోత్సహిస్తున్నారని అర్థం అవుతోందని సూర్యనారాయణరెడ్డి అన్నారు. పాత్రికేయులు కూడా ప్రజాధనం దుర్వినియోగం బాగోతాలను వెలికితీసేందుకు కృషి చేయాలని ఆయన సూగుతున్న బాగోతాలను వెలికితీయడానికి తమ వంతు కృషి చేయాలని ఆయన అన్నారు. మట్టి దందాపై న్యాయపోరాటం చేస్తామని, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి, వాళ్లు ఆశ చూపిస్తున్న అవినీతి సొమ్ముకు కక్కుర్తిపడి అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా దుర్గాప్రసాద్, మట్టా శ్రీను, ప్రగడరెడ్డి గౌరీశంకర్, కొండేపూడి చిన్నా, కంచుమర్తి సాయిబాబా, మామిడాల సూరిబాబు, గొల్లపల్లి రవి, మట్టా ప్రసాద్, నల్లా తేజ, మల్లెంపూడి బుల్లియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.